## రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌కు చింతలపాలెం క్రీడాకారులు



జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌కు ఎంపికైన క్రీడాకారులు

చింతలపాలెం, డిసెంబర్ 27 : జనగాం జిల్లాలో ఈ నెల 27 నుంచి 30 వరకు జరుగనున్న 50వ రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌కు చింతలపాలెం మండల కేంద్రానికి చెందిన జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారులు మాలావత్ రాముడు, బత్తుల రవితేజ, బాణావత్ సైదులు, షేక్ జావీద్ ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మోర్తాల నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను గ్రామస్తులు అభినందించారు.


# నమస్తే తెలంగాణ
# యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, శనివారం 28 డిసెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI




పెండింగ్ బిల్లులు చెల్లించాలని రాజాపేటలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న తాజా మాజీ సర్పంచులు

# శ్రమకు తగిన వేతనమేది?



- టోకెన్ సమ్మెలో భాగంగా విధులు బహిష్కరించిన గ్రామ పంచాయతీ కార్మికులు
- తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : తమ సమస్యలు పరిష్కంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర జేఏసీ డిసెంబర్ 27, 28 తేదీల్లో టోకెన్ సమ్మె పిలుపులో నిరసన వ్యక్తం చేశారు. నల్లగొండ, తిప్పర్తి, చిట్యాల, కేతేపల్లి, మునుగోడు, పెద్దవూర, హుజూర్‌నగర్, మేళ్లచెర్వు, మోతె, రామన్నపేట, చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లి, ఆత్మకూర్.ఎం, భువనగిరి, బీబీనగర్ మండల కేంద్రాల్లో కార్మికులు ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని, వేతనాలకు సెపరేట్ గ్రాంట్ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి కార్మికుడికి ప్రమాద బీమా, ఈఎస్ఐ కల్పించాలని కార్మికులందరినీ పర్మినెంట్ చేసి రిటైర్‌మెంట్ బెనిఫిట్‌గా రూ. 5 లక్షలు ఇవ్వాలని కోరారు. అత్యధిక శ్రమ దోపిడీకి గురవుతున్న గ్రామ పంచాయతీ కార్మికలకు వేతనం రూ.26 వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ టోకెన్ సమ్మెతో సమస్యలు పరిష్కంచకపోతే రాబోయే రోజుల్లో నిరవధిక సమ్మెలోకి వెళ్లడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.



ఆత్మకూర్(ఎం) : ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- మహాత్మా గాంధీకి వినతిపత్రం అందజేసిన తాజా మాజీ సర్పంచులు
- సీఎం రేవంత్‌రెడ్డికి కనువిప్పు కలిగించాలని వేడుకోలు

రాజాపేట/భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 27 : తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పలువురు తాజా మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం రాజాపేట, భూదాన్ పోచంపల్లి మండల కేంద్రాల్లో మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాజాపేట మండల నాయకుడు నాగిర్తి గోపిరెడ్డి మాట్లాడుతూ తమ సొంత నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి బాటలు వేశామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఏడాదిగా ప్రభుత్వం పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 20 ఉత్తమ గ్రామ పంచాయతీల అవార్డులు ఇస్తే అందులో 19తెలంగాణకే రావడం తాము చేసిన అభివృద్ధికి నిదర్శనమని చెప్పారు. సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కనువిప్పు కలిగించి తమ బిల్లులు వెంటనే విడుదల చేసేలా చూడాలని మహాత్మాగాంధీకి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బూరుగు భాగ్యమ్మ, దేవిరాములునాయక్, పంబ కర్ణాకర్, సట్టు తిరుమలేశ్, సంధిల భాస్కర్‌గౌడ్, ఎమ్మ భాస్కర్, బెడిదె వీరేశం, ఉప్పలయ్యాగౌడ్, గజ్జల రాజు, పంజాల వెంకటేశ్, మన్నె పద్మారెడ్డి, గోడల ప్రభాకర్, యాకరి రేణుకానర్సింగ్‌రావు, మట్ట బాలమణీసుదర్శన్, రమావత్ రాములునాయక్, ఎల్లారెడ్డి, పారిజాతామహేశ్ పాల్గొన్నారు.



భూదాన్ పోచంపల్లిలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న తాజా మాజీ సర్పంచులు

## వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..!

- ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన మహిళ
- నిందితులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేశ్

డిండి, డిసెంబర్ 27 : వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను మహిళ హత్య చేసింది. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు చీరతో చెట్టుకు ఉరివేసి అతను ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం చేశారు. ఈ కేసును ఛేదించిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం సీఐ సురేశ్ విలేకరులకు తెలిపారు. డిండి మండలంలోని దేవత్‌పల్లి గ్రామానికి చెందిన రమావత్ కుమార్, లక్ష్మి భార్యాభర్తలు. గ్రామంలో ఉన్న భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. అయితే సంవత్సరం క్రితం బతుకు దెరువు కోసం భార్యాభర్తలు హైదరాబాద్‌కు వెళ్లారు. కుమార్ ఆటో నడుపుతుండగా లక్ష్మి భవననిర్మాణ పనుల్లో కూలికి వెళ్లేది. అదే క్రమంలో తుంగతుర్తి మండలం వెలుగుపల్లికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు వంగాల మధుతో లక్ష్మికి ఏర్పడిన పరిచయం ఇద్దరి మధ్య వివాహేతర సంబంధానికి దారి తీసింది. కొద్ది రోజులు అక్కడే ఉన్న భార్యాభర్తలు అనంతరం తిరిగి గ్రామానికి వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నారు. లక్ష్మిని కలిసేందుకు వంగాల మధు తరచూ గ్రామానికి వచ్చేవాడు. అయితే తమ మధ్య ఉన్న సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడని, అతడిని చంపాలని లక్ష్మి నిర్ణయించి విషయాన్ని ప్రియుడికి తెలిపింది. ఈ విషయంతో తమకు సాయం చేయాలని వంగాల మధు తన స్నేహితుడు గుడిమల్కాపురానికి చెందిన నల్లారపు సాయి కిరణ్‌ను కోరగా అతను అంగీకరించాడు. ఈ నెల 23న రాత్రి రమావత్ కుమార్, భార్య లక్ష్మితో కలిసి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం వంగాల మధు అతడి స్నేహితుడు సాయికిరణ్‌తో కలిసి వారి పొలం వద్దకు వెళ్లాడు. భార్య, ప్రియుడు, అతడి స్నేహితుడు కలిసి కుమార్‌ను గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం చీరతో ఉరి వేసి చెట్టుకు వేలాడదీశారు. కుమార్ ఆత్మహత్య చేసుకున్నట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించారు. అయితే కుమార్ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ అతడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దేవరకొండ డీఎస్పీ గిరిబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. లక్ష్మి, వంగాల మధు, సాయి కిరణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా తామే హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు శుక్రవారం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేశ్ తెలిపారు. కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన సీఐ సురేశ్, ఎస్ఐ రాజు, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు ప్రకటించారు.

## సాగర్‌లో పర్యాటకుల సందడి

- వరుస సెలవులతో పెద్ద సంఖ్యలో జనం రాక
- నేటితో శ్రీశైలానికి 9వ లాంచీ ట్రిప్పు
- 560 అడుగుల వరకే శ్రీశైలానికి లాంచీ ప్రయాణాలకు అవకాశం



లాంచీలో శుక్రవారం నాగార్జునకొండకు వెళ్లి వస్తున్న పర్యాటకులు

నందికొండ, డిసెంబర్ 27 : ప్రపంచ పర్యాటక ప్రాంతమైన నందికొండ శుక్రవారం పర్యాటకులతో సందడిగా మారింది. ప్రభుత్వ సెలవులకుతోడు వారాంత దినాలు కావడంతో పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తెలంగాణ టూరిజం కృష్ణా నదిలో ఏర్పాటు చేసిన లాంచీలో నాగార్జునకొండకు, జాలీ ట్రిప్పులకు పర్యాటకులు ఆసక్తి కనబర్చారు. నల్లమల్ల అడవుల సహజ అందాల మధ్య లాంచీ ప్రయాణం బాగుందని పర్యాటకులు తెలిపారు. నదీ తీరంలో పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. పర్యాటకులతో నాగార్జునసాగర్ డ్యామ్, లాంచీ స్టేషన్, బుద్ధవనం పరిసరాలు కిటకిటలాడాయి.

నవంబర్ రెండున నాగార్జునసాగర్ హిల్‌కాలనీ లాంచీ స్టేషన్ నుంచి శ్రీశైలానికి లాంచీ ప్రయాణాలను టూరిజం శాఖ ప్రారంభించింది. ప్రతి శనివారం లాంచీ శ్రీశైలం బయల్దేరి తిరిగి ఆదివారం సాయంత్రం నాగార్జునసాగర్‌కు చేరుకుంటుంది. ఇప్పటి వరకు విజయవంతంగా శ్రీశైలానికి 8 లాంచీ ట్రిప్పులను టూరిజం శాఖ నడుపగా శనివారం 9 ట్రిప్పు వెళ్లనున్నది. నాగార్జునసాగర్ జలాశయం నీటి మట్టం 560 అడుగులు ఉన్నంత వరకు శ్రీశైలానికి లాంచీలను నాగార్జుసాగర్ నుంచి నడిపేందుకు వీలు ఉంటుంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ డ్యామ్ నీటి మట్టం 573.80 అడుగుల వద్ద ఉంది. 9వ ట్రిప్పు తర్వాత ఇంకొక ట్రిప్పుతో శ్రీశైలానికి లాంచీ ప్రయాణాలు ముగేసే అవకాశం ఉంది. శ్రీశైలం లాంచీ ట్రిప్పులను పర్యాటకులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని టూరిజం అధికారులు కోరారు.



నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌లో మహా సభల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, యూటీఎఫ్ నేతలు

## నేటి నుంచి టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహా సభలు

- నల్లగొండలోని లక్ష్మీగార్డెన్‌లో మూడు రోజులపాటు నిర్వహణ
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి
- తొలిరోజు హాజరుకానున్న 7వేల మంది ఉపాధ్యాయులు

రామగిరి, డిసెంబర్ 27 : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) 6వ రాష్ట్ర మహాసభలు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 28, 29, 30వరకు జరుగనున్నాయి. హైదరాబాద్ రోడ్డులోని లక్ష్మీగార్డెన్‌లో అమరజీవి షేక్ మహబూబ్ అలీ ప్రాంగణం పేరుతో సభకు ఏర్పాట్లు చేశారు. సభలకు వచ్చే ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించడంతో రాష్ట్ర వ్యాప్తంగా తొలి రోజు 7వేలమంది ఉపాధ్యాయులు తరలి వస్తారని ఆహ్వాన సంఘం చైర్మన్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం సభలు జరిగే ప్రాంతాన్ని వారు పరిశీలించారు. మూడు రోజులు సాగే సభలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్వాగత తోరణాలు కట్టారు. ఉమ్మడి రాష్ట్రం 2008లో విజయవంతంగా రాష్ట్ర మహాసభలు నిర్వహించగా, ఇప్పుడు ఆదే స్ఫూర్తితో ఏర్పాట్లు చేశారు.

### గడియారం సెంటర్ నుంచి ప్రదర్శన

మహాసభల ప్రారంభోత్సవం సందర్భంగా తొలి రోజు రాష్ట్ర వ్యాప్తంగా తరలిరానున్న 7వేల మంది ఉపాధ్యాయులతో గడియారం సెంటర్ నుంచి లక్ష్మీగార్డెన్ వరకు మహా ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం జాతీయ పతాకావిష్కరణ, ఎస్‌టీఎఫ్ఐ, టీఎస్‌యూటీఎఫ్ జెండాల ఆవిష్కరణ ఉంటుంది. మహాసభలకు అతిథులుగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ, భువనగిరి ఎంపీలు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి తదితరులు హాజరుకానున్నారు. మధ్యాహ్నం జరిగే విద్యా సదస్సులో మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌రావు, జేఎన్‌యూ ఢిల్లీ పూర్వ విద్యార్థి నాయకుడు కుమారి అయిషే ఘోష్, రాత్రి జరిగే సాంస్కృతిక ప్రదర్శనలకు సినీగేయ రచయిత, కవి సుద్దాల అశోక్‌తేజ పాల్గొననున్నారు.



# ఆ డాక్టర్ రూటే సెప 'రేటు'

## రూ.500 ఇస్తే ఏ సంతకానికైనా రెడీ

- ప్రైవేట్ దవాఖానల్లోనూ పెయిడ్ సర్వీస్
- సూర్యాపేట జనరల్ దవాఖాన డాక్టర్ నిర్వాకమిది

సూర్యాపేట, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఎవరికైనా ఏదైనా అవసర నిమిత్తం గెజిటెడ్ ఆఫీసర్ సంతకం కావాలన్నా.. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం వచ్చినా.. మరేదైనా సంతకం కావాలన్నా నేరుగా సూర్యాపేట జనరల్ దవాఖానలోని ఓ డాక్టర్‌ను కలిస్తే సరిపోతుందనే ప్రచారం అక్కడ జరుగుతున్నది. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నా సరే ఫోన్ చేస్తే వచ్చి సంతకం పెట్టి ఐదొందలు తీసుకుంటాడట.! అంతే కాదు వందకు పైనే ఉన్న డాక్టర్లలో ఈ ఒక్కడి నిర్వాకం ఎలా ఉందంటే ప్రభుత్వ ఆసుపత్రిలో విధుల్లో ఉంటూనే ఎవరైనా ప్రైవేట్ ఆసుపత్రిలో డాక్టర్‌కు అత్యవసర పని ఉండి బయటకు వెళ్తే ఆయనకు ఫోన్ చేస్తే వెంటనే వాలిపోతాడట.! రెండు నుంచి మూడు గంటల విధులు నిర్వర్తించి అప్పటి వరకు వచ్చిన ఫీజులను అతనే తీసుకుని పెయిడ్ సర్వీసు ఇస్తున్నాడట. కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు అందించిన ఈ ఆస్పత్రి బ్రాండ్ రోజురోజుకు దిగజారుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో వెలుగు వెలిగిన ప్రభుత్వ వైద్యం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే మసకబారుతున్నది. నాడు మెరుగైన వైద్యం, చికిత్సలు చేయడంలో అనేక రివార్డులు, అవార్డులు అందుకున్న చోట నేడు వైద్యాధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ కరువు రాజ్యమేలుతున్నది. మాజీ మంత్రి ప్రస్తుత సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పట్టుబట్టి నాటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి సూర్యాపేటకు మెడికల్ కళాశాలను తెప్పిస్తే అప్పటి వరకు ఇక్కడ ఉన్న ఏరియా ఆసుపత్రి సకల హంగులతో జనరల్ దవాఖానగా రూపాంతరం చెందింది. నాటి నుంచి సూర్యాపేట జిల్లాతోపాటు పరిసర జిల్లాల ప్రజలకు సాధారణ జ్వరం నుంచి మొదలుకుంటే ఉచితంగా మోకీళ్ల ఆపరేషన్ల లాంటి అనేక రకాల ఆపరేషన్లు, అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తూ వచ్చింది. ప్రసవాలు, ఓపీ వంటి వాటిలో రాష్ట్ర స్థాయిలో రికార్డులు అందుకుంది. కానీ గత ఏడాది కాలంగా కాంగ్రెస్ పాలనలో సూర్యాపేట జనరల్ దవాఖానకు వెళ్తే అక్కడ దిగజారిపోతున్న వైద్య సేవలు, పర్యవేక్షణ కరువు ఎవరికి వారు యమునాతీరు అన్నట్లు మారిపోతుండడం బాధ కల్గిస్తుందని పలువురు వాపోతున్నారు. సరిపడా మందులు లేవు, టెస్టులు కరువు, డాక్టర్లు అందుబాటులో ఉండరు..మొత్తం మీద ఈ దవాఖానను పట్టించుకునే నాధుడే కరువవడంతో ఎవరికి వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మెడికల్ విద్యార్థులే దాదాపు 90 శాతం చికిత్సలు అందిస్తుండగా డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాదు అక్రమాలకు అడ్డాగా ఈ ఆస్పత్రి మారి ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగాల కోసం వెయిటేజీ మార్కులు కలుపుకొనేందుకు డబ్బులు తీసుకొని ఫేక్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు ఇచ్చారనే ఆరోపణలూ ఉన్నాయి. ఈ దవాఖానలో ఒక సాధారణ వ్యక్తి డాక్టర్ అవతారం ఎత్తినా గుర్తించలేని దుస్థితి నెలకొనగా మరో ప్రైవేట్ వ్యక్తి గుర్తించగా మందలించి వదిలేశారు. ఇదిలా ఉంటే ఈ ఆసుపత్రిలో ఓ ఐదొందల డాక్టర్ ఉన్నాడని, అతను ఆ డబ్బుల కోసం ఎంతకైనా తెగిస్తాడని ప్రచారం సాగుతున్నది. ఎవరికైనా గెజిటెడ్ సంతకం లేదా డాక్టర్ సర్టిఫికెట్ కావాలంటే సదరు డాక్టర్‌కు ఫోన్ చేస్తే ఎక్కడ ఉన్నా వెంటనే వచ్చి ఐదొందలు తీసుకొని సంతకాలు చేసి ముద్ర వేస్తాడట. అంతేకాదు పట్టణంలోని ఏదైనా ప్రైవేట్ ఆసుపత్రిలో రెండు మూడు గంటల ఇతర పని ఉన్న డాక్టర్లు ఈ ఐదొందల డాక్టర్‌కు ఫోన్ చేసి డ్యూటీ చేయించి డబ్బులు ఇస్తారని చెబుతున్నారు. దాంతో ఒకప్పుడు వెలుగులు వెలిగిన జనరల్ ఆసుపత్రి ఏ స్థాయికి దిగజారుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ఎవరో ఒకరు స్పందించి ఈ దవాఖానను చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

### డాక్టర్ అవతారమెత్తిన వ్యక్తి.. గుర్తించని అధికారులు

సూర్యాపేట జనరల్ దవాఖానలో ఇప్పటికే మందుల కొరత వేధిస్తుండగా డాక్టర్లు చుట్టపుచూపుగా వచ్చిపోతుండడం, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దవాఖాన నిర్వహణ ఎలాంటి పరిస్థితుల్లో ఉందనేది తెలుస్తున్నది. కాగా ఇటీవల ఓ వ్యక్తి కాలుకు గాయమైతే కట్టు కట్టేందుకు మెటీరియల్ అందుబాటులో లేకనో మరేదైనా కారణమో తెలియదు కానీ అట్ట ముక్కతో కట్టుకట్టి వైద్యానికే మచ్చుతెచ్చాడు. తాజాగా ఓ వ్యక్తి మూడు రోజుల పాటు డాక్టర్ అవతారమెత్తి రోగుల బెడ్స్ వద్దకు వెళ్లి సిబ్బందిని పిలిచి ఏమి మందు లు ఇస్తున్నారు అంటూ తనకు తెలిసిన మందుల పేర్లు చెబుతూ వాటిని ఇవ్వాలని చెప్పగా సిబ్బంది ఆ వ్యక్తి మాటలు ఫాలో అవుతూ మందులు ఇచ్చినట్లు తెలిసింది. మూడు రోజుల పాటు డాక్టర్‌గా చలామణి అయినట్లు తెలుస్తుండగా పేషెంట్ల కేస్ షీట్‌లో డాక్టర్ పేరు ఉంటుండగా అక్కడకు వచ్చిన డాక్టర్ ఎవరు అనేది గుర్తించకపోవడం సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువుటద్దం. ఇంత జరుగుతున్నా అతను డాక్టర్ కాదని ఎవరూ గుర్తించకపోగా, ఓ రోగి వెంట వచ్చిన అటెండర్ గుర్తించి ప్రశ్నిస్తే వెలుగులోకి వచ్చింది. వెంటనే ఓ డాక్టర్, ఇతర సిబ్బంది సదరు వ్యక్తిని పట్టుకొని మాట్లాడి ఆరా తీసి హెచ్చరించి పంపించినట్లు తెలిసింది. డాక్టర్‌గా చలామణి అవుతూ ఆయన చెప్పిన మందులు వాడినా ఎవరికీ ఇబ్బంది కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నామని, కానీ ఒకవేళ ఏదైనా జరిగి ఉంటే గందరగోళంగా మారేదని ఓ వైద్యాధికారి ఆస్పత్రి నిర్వహణ పట్ల అసహనం వ్యక్తం చేశాడు.


